క్లుప్తంగా

నియామకం


యాదగిరి, సంగెం


వెంకటేశ్వర్లు, పర్వతగిరి

పర్వతగిరి /సంగెం : తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం పర్వతగిరి మండల కన్వీనర్‌గా చల్లా వెంకటేశ్వర్లు, సంగెం మండల కన్వీనర్‌గా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల యాదగిరి నియామకమయ్యారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ బుధవారం వారికి నియామక పత్రాలు అందజేశారు.

కుల పెద్దమనిషిగా మోహన్‌నాయక్



పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండ పరిధిలోని బోటికాడితండా, ఉట్టితండా, అక్కా తండాలో బొడ్రాయి(విజయదశమి) వేడుకల సందర్భంగా కులపెద్దగా భూక్య మోహన్ నాయక్‌ను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌నుంచి బహిష్కరణ



నల్లబెల్లి : గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్న మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మేడిపల్లి రాజు గౌడ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత నిర్ణయాలతో పార్టీకి నష్టం కలిగించే వారు ఎంతటి వారైన క్రమ శిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



రాయపర్తి : మండలంలోని వాంకుడోత్ తండాలో సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. నాయకులు మహేందర్, నర్సయ్య, మల్లయ్య, భాస్కర్, పెంటయ్య, దేవేందర్, ఎల్లయ్య, అశోక్, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాలకు చెందిన మాడిశెట్టి మాధవి, తాళ్లపల్లి సమత డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. కాగా బుధవారం గురిజాల ఉద్యోగుల ఐక్యవేదిక అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు గొలనకొండ వేణు, ప్రధాన కార్యదర్శి చుక్క రాజేందర్ వారిని అభినందించారు.

పల్లెప్రకృతి వనం ధ్వంసం

నెక్కొండ : మండలంలోని చంద్రుగొండ పల్లె ప్రకృతి వనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక హైస్కూల్‌లో హరితహారంలో భాగంగా పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారని, బతుకమ్మ వేడుకల ఏర్పాటులో భాగంగా కొందరు పల్లె ప్రకృతి వనంలోని చెట్లను తొలగించారని ఆయన పేర్కొన్నారు. ధ్వంసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆయన చెప్పారు. ఎస్సై మహేందర్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

వృద్ధుల శ్రమదానం



చెన్నారావుపేట : చెన్నారావుపేట నుంచి కోనాపురం వెళ్లే రోడ్డుపై మలుపుల వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా ఉండటంతో బుధవారం వృద్ధుల సంఘం ఆధ్వర్యంలో శ్రమదానం చేసి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ మాట్లాడుతూ.. మలుపుల వద్ద చెట్లు గుబురుగా పెరిగి వచ్చి పోయే వాహనాలకు ఇబ్బందికరంగా ఉండటంతో వాటిని తొలగించామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య, గౌరవ అధ్యక్షుడు వరంగంటి మల్ల య్య, సభ్యులు ముత్యం సాంబయ్య, సిద్ద కుమారస్వామి, నారాయణరెడ్డి, పత్తి సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

విరాళం అందజేత

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలో నిర్మిస్తున్న సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం గ్రామానికి చెందిన పంతంగి అమృతరవీందర్ రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు.

‘ఉపాధి’కి ప్రణాళికలు

- కొనసాగుతున్న గ్రామసభలు
- 2025–26 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు
- ప్రజలు ఆమోదించిన పనులకే తీర్మానాలు


గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

నల్లబెల్లి : గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి పేదలకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ప్రతి కుటుంబానికి ఏడాదికి వంద రోజుల పనిదినాలు కల్పిస్తూ కష్టకాలంలో వారికి ఆర్థిక భరోసా కల్పిస్తోంది. జిల్లా వ్యాప్తంగా అధికారులు, ప్రత్యేకాధికారులు గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ ప్రణాళికలు తయారు చేస్తున్నారు. రైతులకు అవసరమైన పనులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వీటిపై చర్చించి ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తున్నారు. వాటిపై చర్చించి ప్రజల అభిప్రాయాల మేరకు తీర్మానాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 2వ తేదీ మహాత్మాగాంధీ జయంతి రోజు నుంచి ఆయా పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా ఎక్కువగా వ్యవసాయ అనుబంధ పనులైన కుంటల నిర్మాణం, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై చర్చిస్తూ ఉపాధి హామీ లేబర్ బడ్జెట్, పని దినాల కోసం అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేస్తూ గ్రామసభల్లో తీర్మానాలు చేస్తున్నారు. ఈ ప్రతిపాదనలు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పనుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదికలను పంపించనున్నారు. ప్రతిపాదనలు పంపిన పనులను ప్రభుత్వం మంజూరు చేస్తే 2025 ఏప్రిల్ నుంచి నూతన పనిదినాలను ప్రారంభమవుతాయి.

నవంబర్ 30 వరకు గ్రామసభలు

జిల్లాలో ఆయా గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు గుర్తించేందుకు నవంబర్ 30వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. అనంతరం గ్రామసభల్లో తీర్మానించిన పనులను మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు పంపించనున్నారు. గ్రామ సభల్లో ఆమోదించిన పనులను వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపడుతారు. ఈ మేరకు గ్రామాల్లో ఉపాధి సిబ్బంది, రైతులు, గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారులు గ్రామ సభలు నిర్వహిస్తున్నారు.

ఉపాధి కూలీల వివరాలు

ఉపాధి హామీ జాబ్ కార్డులు	: 1,19,997
ఉపాధి హామీ కూలీలు	: 2,39,308
పనులు చేస్తున్న కూలీలు	: 1,36,174
కల్పించాల్సిన పనుల లక్ష్యం	: 24,58,054
ఇప్పటి వరకు కల్పించిన పనిదినాలు	: 22,34,794
100 రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలు	: 216

గ్రామసభలు నిర్వహిస్తున్నాం



ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ కూలీల భాగస్వామ్యంతో గ్రామసభలు నిర్వహించి తీర్మానం చేస్తున్నాం. మండలాల వారిగా సేకరించిన వివరాలను క్రోడికరించి నివేదికలను రూపొందిస్తాం. కలెక్టర్ అనుమతితో ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం.

– కౌసల్యాదేవి, డీఆర్‌డీఓ, వరంగల్

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


శ్రీనివాసుడి కల్యాణమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి : శ్రీనివాసుడి ఆశీస్సులతో పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఊకల్ బాలాజీతండాలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వెంకటేశ్వరుడి ఆశీస్సుల వల్లే తాను గెలిచానని తెలిపారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, వల్లపు కుమార్, సురేందర్‌రెడ్డి, బూడిద రవి, పాలశ్రీనివాస్, బూటాసింగ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బురహాన్ పల్లిలో మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ విగ్రహాన్ని, మైలారంలో గూడెల్లి రాజేష్ ప్రథమ వర్ధంతిలో పాల్గొని వారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు.

ఊరుపేరు నిలబెట్టిన విద్యాకుసుమాలు

- ఉప్పరపల్లి నుంచి 8 మందికి ఉపాధ్యాయ కొలువులు


నియామక పత్రం అందుకుంటున్న ముత్యాల సురేశ్

చెన్నారావుపేట : ఆటపాటలతో పాటు పలు పోటీ పరీక్షల్లో మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూనే ఏకంగా ఎనిమిది మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించి సత్తా చాటి శభాష్ అనిపించుకున్నారు ఉప్పరపల్లి యువకులు..

మండలంలోని ఉప్పరపల్లికి చెందిన మేరుగు పూలమ్మ–బాబుగౌడ్ దంపతుల కుమారుడు హరిగౌడ్ ఎస్‌జీటీగా మహబూబాబాద్ జిల్లాలో, కోన్‌రెడ్డి రుద్రమాదేవి- మహేందర్‌రెడ్డి దంపతుల కుమార్తె సమత, బొమ్మెర కొంరమ్మ–కొమ్మాలు దంపతుల కుమారుడు సతీష్, పల్లకొండ భాగ్య–రవీందర్ దంపతుల కుమార్తె శిల్ప, కుక్కల వేణు భార్య శృతి, పులిశేరు భారతమ్మ–భిక్షపతిల కుమారుడు మహేష్, సంగెం జ్యోతి–కుమారస్వామి దంపతుల కుమారుడు సాత్విక్, బోదే లక్ష్మి–జీవన్‌రెడ్డిల కుమార్తె దివ్య ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. దీంతో గ్రామంలోని పెద్దలు, విద్యావంతులు, ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు.

కొలువు కొట్టిన దంపతులు

మూడుముళ్ల బంధంతో ఒక్కటైన లింగాపురం గ్రామానికి చెందిన రాయరాకుల రోజా–రంజిత్ దంపతులు టీచర్ ఉద్యోగాలు సాధించారు. రంజిత్ గతంలో ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. వరంగల్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 14వ ర్యాంకు, లాంగ్వేజ్ పండిట్ తెలుగులో 9వ ర్యాంకు సాధించాడు. అతని భార్య సోషల్ స్టడీస్‌లో 70వ ర్యాంకు పొందారు. రంజిత్ స్కూల్ అసిస్టెంట్‌గా, రోజా స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో మహబూబాబాద్ జిల్లాలో ఉద్యోగం సాధించారు.

మూడు ఉద్యోగాలు..

మండలంలోని జల్లీ గ్రామానికి చెందిన ముత్యాల సురేశ్ చిన్న కొర్పోలులో పంచాయతీ కార్యదర్శిగా నాలుగేళ్లు పనిచేశాడు. మూడు నెలల క్రితం నర్సంపేట గురుకుల టీచర్‌గా, ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌గా నియామక పత్రం అందుకున్నాడు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి


నెక్కొండ: మాట్లాడుతున్న సీఐ చంద్రమోహన్


సంగెం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీందర్


నర్సంపేట: ఏర్పాట్లను పరిశీలిస్తున్న రజని

నెక్కొండ : బతుకమ్మ, విజయదశమి వేడుకలను మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నెక్కొండ సీఐ చంద్రమోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులతో జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడారు. సమావేశంలో ఎస్సై మహేందర్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ దయాకర్, వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి

చెన్నారావుపేట : పూల పండుగ సద్దుల బతుకమ్మ వేడుకల కోసం అధికారులు గ్రామాలలో ఏర్పాటు పూర్తి చేశారు. విద్యుత్ దీపాలతో గ్రామాలు మిరిమిట్లుగొలుపుతున్నాయి. నేడు సద్దుల బతుకమ్మ సంబరాలను మహిళలు ఘనంగా జరుపుకోవాలని పలువురు పేర్కొన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

పర్వతగిరి : బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద బతుకమ్మ ఏర్పాట్లను బుధవారం ఎంపీడీఓ శంకర్‌నాయక్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంపీఓ శ్రీనివాస్, కార్యదర్శి రఘు, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు కుసం రామచందర్, సొసైటీ డైరెక్టర్ గంగాధర్‌రావు, నాయకులు సునీల్‌రావు, పాపారావు, బొట్ల వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన..

నర్సంపేట : నర్సంపేట అంగడి మైదానంలో బతుకమ్మ ఏర్పాట్లను మున్సిపల్ చైర్ పర్సన్ గుంటి రజనికిషన్ బుధవారం కౌన్సిలర్లు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపడుచులు సద్దుల బతుకమ్మ ఆడడం కోసం ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సంగెం : ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఎంపీడీఓ కాసర్ల రవీందర్, ఎస్సై నరేష్‌లు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలు, నిమజ్జన ప్రాంతంలో లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు లేనందున పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు బాధ్యతగా పనిచేసి దసరా వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కొమురయ్య, ఐబీ ఏఈలు హమీద్, సాయిరాజ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మలతో వైద్యసిబ్బంది

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వైద్య సిబ్బంది బతుకమ్మలు పేర్చి ఆస్పత్రి ఆవరణలో ఆడిపాడారు. వైద్యాధికారి కిరణ్‌రాజు, సాంబయ్య, సలోమి, సబిత, సరస్వతి, సునీత, కోమల, రజిత, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

చెన్నారావుపేట : చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని సొసైటీ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం సొసైటీలో తనకు తానే స్వీయ నిర్బంధం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీలో జరుగుతున్న అవకతవకలపై జిల్లా సహకార అధికారి ఎం.నీరజకు సెప్టెంబర్‌లో కార్యాలయ రికార్డుల పరిశీలనకు అనుమతి కోరినట్లు తెలిపారు. నేటికి అనుమతి ఇవ్వలేదని దీంతో రికార్డుల పరిశీలనకు అనమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్వీయ నిర్బంధం చేసుకున్నాడు.

మహిళలు చైతన్యవంతులై పోరాడాలి


ప్లకార్డులు, బతుకమ్మతో ప్రదన ఇస్తున్న మహిళలు

నర్సంపేట : సమాజంలోని అసమానతలు రూపుమాపడం కోసం మహిళలు చైతన్యవంతులై పోరాడాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల రాగసుధ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని కారల్ మార్క్స్ నగర్‌లో మంగళవారం రాత్రి మహిళలు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఉత్సవాల్లో యువతను చైతన్యం చేసేలా ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాగసుధ మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యంతో యువతకు నిరుద్యోగ సమస్య పెను సవాల్‌గా మారిందన్నారు. కుల, మతాలు, మూఢ విశ్వాసాలు, మత్తు పదార్థాలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలు, విష సంస్కృతిలో యువత తమ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాల్సి బతుకమ్మ పండుగను పెరిగిన ధరల కారణంగా పస్తులు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్యాన్ని నిషేధించి మహిళల తాళిబొట్లు కాపాడాలని, అశ్లీల వెబ్‌సైట్లను తొలగించాలని, మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడాలని కోరారు. ఏఐఎఫ్‌డీడబ్ల్యూ నాయకులు చొప్పరి పద్మ, గణిపాక బిందు, మాలమ్మ, లక్ష్మి, గీత, నర్సమ్మ, సాంబ, భవాని, రమ్య, సరస్వతి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకరణలో దుర్గామాత


ఖానాపురం: బుధరావుపేటలో భక్తుల పూజలు


నెక్కొండ: రామలింగేశ్వరాలయంలో..


వర్ధన్నపేట: పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ

నెక్కొండ: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వర ఆలయంలోబుధవారం అమ్మవారు సరస్వతీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అర్చకుడు బీవీఎస్ శాస్త్రి, పండితులు శ్రావణ్‌శాస్త్రి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నెక్కొండ మండల కేంద్రంలోని హనుమాన్ బజారులో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి ప్రారంభించి, మాట్లాడారు.

సరస్వతిదేవీగా అమ్మవారు

చెన్నారావుపేట/ఖానాపురం : చెన్నారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు బుధవారం సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఖానాపురం మండలంలోని బుధరావుపేట, అశోక్‌నగర్‌తో పాటు పలు గ్రామాల్లో అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి అన్నదానాలు చేపట్టారు. భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

వర్ధన్నపేట : వర్ధన్నపేటలో అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సరస్వతీ దేవి అలంకరణలో భాగంగా వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు.


చెన్నారావుపేట: సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు


నెక్కొండలో అన్నదానం

చికిత్స పొందుతున్న యువతి మృతి


శ్రీవల్లి(ఫైల్)

దుగ్గొండి : కిడ్నీ నొప్పి భరించలేక పురుగుల మందుతాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి మృతి చెందిన సంఘటన మండలంలోని గోపాలపురంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన నాగులగాని శ్రీవల్లి(17) వంచనగిరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. అయితే చాలా కాలంగా శ్రీవల్లి కిడ్నీ నొప్పితో బాధపడుతోంది. కాగా గత నెలలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో గమనించిన ఇరుగు పొరుగు వారు ఎంజీఎంకు తరలించారు. నెలరోజులుగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి చిన్న రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన ఎరసాని శ్రీశైలం తన మూడు మేకలు, నాలుగు గొర్రె పోతులు పోయాయని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. సోమవారం అర్ధరాత్రి గొర్రెలు, మేకలు పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


చెన్నారావుపేట: శౌరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి


ఖానాపురం: కౌసల్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హుస్సేన్‌నాయక్

చెన్నారావుపేట /దుగ్గొండి : మండలంలోని జోజిపేట నారాయణతండాకు చెందిన కొండవీటి శౌరయ్య, కోనాపురం గ్రామానికి చెందిన ఉప్పుల సాయిలు ఇటీవల మృతి చెందగా వారి చిత్రపటాలకు నివాళులర్పించి బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అలాగే దుగ్గొండి మండలంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బానోత్ పత్తినాయక్, మాజీ ఎంపీపీ జక్క అశోక్, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, అనుముల కుమారస్వామి, కంది కృష్ణచైతన్య, కొండవీటి ప్రదీప్‌కుమార్, బోడ మురళినాయక్, సాధు నర్సింగరావు, విజేందర్‌రెడ్డి, మూడు రమేష్, నర్మెట్ట యాదగిరి, దుగ్గొండి మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, పొన్నం మొగిలి, రంగారావు, ఓడేటి తిరుపతిరెడ్డి, యుగందర్, మహేందర్ పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కౌసల్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్‌నాయక్ బుధవారం పరామర్శించారు. బాలునాయక్, కిషన్, గిరిజన సంఘం నాయకులు ఉన్నారు.

పరిహారం ఇప్పించండి



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరంలో రెండు రోజుల క్రితం విద్యుత్ తీగలు తెగిపడడంతో పలువురి ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, మీటర్లు కాలిపోయాయని పలువురు వాపోయారు. దీంతో రూ.50వేల ఆస్తి నష్టం జరిగిందని, పరిహారం ఇప్పించి, కొత్త మీటర్లను బిగించాలని సీపీఎం మండల కార్యదర్శి కొరబోయిన కుమారస్వామి డిమాండ్ చేశారు. అనంతరం మహేశ్వరం సబ్ స్టేషన్ ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని కార్యాలయంలో అందించారు. నాయకులు మలహాల్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, కొలువుల శివకుమార్, రుద్రారపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.